సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 6 । ఆగస్టు । 2024



దరఖాస్తుల వెల్లువ
కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో యాభై ఫిర్యాదులు నమోదయ్యాయి.
- 8లో ▸



పారిశుధ్యంపై దృష్టి సారించండి
పారిశుధ్యంపై దృష్టి సారించి స్వచ్ఛ తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.5 /22.2

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఉప్పల్‌వాయి రైల్వే గేటు మూసివేత

రామారెడ్డి: ఉప్పల్‌వాయి రైల్వే గేటును మంగళవారంనుంచి మూడు రోజులపాటు మూసి ఉంచనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేటు మరమ్మతుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. రామారెడ్డి –సదాశివనగర్ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించి సహకరించాలని కోరారు.

ఎస్‌జేఎం జిల్లా సంయోజక్‌గా రాహుల్ కుమార్



కామారెడ్డి అర్బన్: స్వదేశీ జాగరణ్ మంచ్(ఎస్‌జేఎం) జిల్లా సంయోజక్(కన్వీనర్)గా జిల్లాకేంద్రానికి చెందిన డాక్టర్ వంగ రాహుల్ కుమార్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఎస్‌జేఎం ప్రాంత సంయోజక్ ముక్కా హరీశ్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాహుల్‌కుమార్‌ను ఎస్‌జేఎం ఇందూర్ విభాగ్ సహ సంయోజక్ బొర్ర రాజాగౌడ్, విభాగ్ విచారక్ యాలాద్రి, సంఘర్షణ వాహిని ప్రముఖ్ సంతోష్‌గౌడ్ అభినందించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి 16 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 503 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1080.20(45.24 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నిజామాబాద్ ఎస్‌ఎల్‌ఆర్ ఏడీగా అశోక్



సుభాష్‌నగర్: నిజామాబాద్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా అశోక్ సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించిన శ్రీనివాసులు హన్మకొండకు బదిలీ అయ్యారు. అశోక్ కరీంనగర్ నుంచి నిజామాబాద్‌కు వచ్చారు. అలాగే కార్యాలయ సూపరింటెండెంట్‌గా హైదరాబాద్ నుంచి వచ్చిన జగదీశ్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ప్రధానకార్యదర్శి నేతికుంట శేఖర్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

నిజామాబాద్ అర్బన్: సిరికొండ మండలం కొండాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మజను సస్పెండ్ చేస్తూ డీఈవో దుర్గాప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో ఆమెను మొదట ఇదే మండలంలోని కొండూర్ పాఠశాలకు కేటాయించారు. అనంతరం ఆ ప్రాంతాన్ని రద్దు చేస్తూ కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. సదరు టీచర్ బదిలీ ఉత్తర్వులను లెక్క చేయకుండా కొండూరు నుంచి రిలీవ్ కాలేదు. తనకు అన్యాయం జరిగిందని ఉపాధ్యాయ సంఘం నాయకులతో ఆమె డీఈవోపై ఆరోపణలు చేశారు. నిబంధనల ప్రకారమే ఆమెకు పాఠశాల కేటాయించినా రిలీవ్ కాకపోవడంతో సస్పెండ్ చేశారు.

స్కూళ్లకు స్కావెంజర్లు!

- పారిశుధ్య సమస్య పరిష్కారం కోసం నిధుల కేటాయింపు
- అడ్వాన్సుగా మూడు నెలల గ్రాంటు విడుదల
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు నియామక బాధ్యతలు

స్కావెంజర్లు లేక అధ్వానంగా తయారైన ప్రభుత్వ పాఠశాలలపై సర్కారు కరుణ చూపింది. ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టింది. టాయ్‌లెట్లను శుభ్రం చేయడంతో పాటు మొక్కలకు నీళ్లు పట్టడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడానికి స్థానికులను నియమించుకోవాలని సూచించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిర్వహణ నిధులు కేటాయిస్తూ విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: జిల్లాలో 653 ప్రాథమిక పాఠశాలల్లో 28,112 మంది, 124 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8,894 మంది, 190 ఉన్నత పాఠశాలల్లో 31,681 మంది చదువుతున్నారు. అలాగే 46 జీరో స్కూళ్లు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో చాలాచోట్ల స్కూళ్ల పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో స్పందించిన సర్కారు పాఠశాలల పరిస్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టింది. టాయ్‌లెట్లను శుభ్రం చేయడంతో పాటు మొక్కలకు నీళ్లు పట్టడం, పరిసరాలను శుభ్రం చేయడానికి స్థానికులను నియమించుకోవాలని సూచించింది. నియామకం బాధ్యతను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. జీరో స్కూళ్లకు ఎలాంటి నిధులు ఇవ్వలేదు. 30 మందిలోపు ఉన్న స్కూళ్లకు నెలకు రూ.3 వేలు, 31 నుంచి వంద మంది వరకు ఉన్న స్కూళ్లకు రూ.6 వేలు, 101 నుంచి 250 మంది వరకు ఉన్న స్కూళ్లకు రూ.8 వేలు, 251 నుంచి 500 మంది వరకు ఉన్న స్కూళ్లకు రూ. 12 వేలు, 501 నుంచి 750 మంది ఉన్న స్కూళ్లకు రూ. 15 వేలు, 750 పైన విద్యార్థులున్న స్కూళ్లకు రూ.20 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏడాదిలో పది నెలలకు నిధులు ఇవ్వనుంది. తొలుత అడ్వాన్సుగా మూడు నెలలకు సరిపడా డబ్బులను డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నుంచి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు ఇవ్వనున్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలదే. సమగ్ర శిక్ష కింద అందిస్తున్న కాంపోజిట్ స్కూల్ గ్రాంట్‌కు అదనంగా ఈ గ్రాంట్ అందిస్తున్నారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం అందించడంతో పాటు మరుగుదొడ్లు శుభ్రపర్చడం, మొక్కలకు నీరు పోయడం వంటి వాటికి ఈ నిధులను వినియోగించుకోవాలి. క్లీనింగ్, స్వీపింగ్ మొదలైన వాటికి అవసరమైన మెటీరియల్ ఖర్చుకోసం సమగ్ర శిక్ష కింద పాఠశాలలకు విడుదల చేసిన కాంపోజిట్ స్కూల్ గ్రాంట్‌ను వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది.

తప్పనున్న విద్యుత్ భారం

నాగిరెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించనున్నట్లు ఇటీవల ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ హామీ అమలైతే ప్రభుత్వ పాఠశాలలపై విద్యుత్ బిల్లుల భారం తప్పనుంది. గత ప్రభుత్వం 'మన ఊరు –మన బడి' పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు డిజిటల్ బోర్డులను అందజేసింది. కానీ విద్యుత్ బిల్లులకు భయపడి చాలా పాఠశాలల్లో డిజిటల్ బోర్డులను ఉపయోగించేందుకు ఉపాధ్యాయులు వెనుకంజ వేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచితవిద్యుత్‌ను అందిస్తే డిజిటల్ విద్య అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు స్థాయిని బట్టి రూ. 500 నుంచి రూ. 3 వేల వరకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. పాఠశాలలకు కేటాయించే బడ్జెట్‌లో సగం నిధులు కరెంట్ బిల్లులకే ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీంతో బడులకు ఉచిత విద్యుత్ అందించాలని ఎప్పటినుంచో కోరుతున్నారు. వారి వినతులను పరిగణనలోకి తీసుకున్న సర్కారు.. ఉచిత విద్యుత్ అందించేందుకు ముందుకు వచ్చింది.



గోపాల్‌పేట హైస్కూల్‌లో డిజిటల్ బోర్డుపై పాఠ్యాంశాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పెరగనున్న వినియోగం

అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన బడులలో ఇటీవల ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అమర్చారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒక్కో గదిలో 2 ఫ్యాన్లు, 4 ట్యూబ్‌లైట్లు బిగించారు. ఉన్నత పాఠశాలల్లో ఒక్కో గదిలో 4 ఫ్యాన్లు, 6 ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేశారు. దీంతోపాటు పాఠశాలల్లో తాగునీటి వసతి కోసం బోర్లువేసి సంపులను తవ్వించారు. వీటన్నింటి నిర్వహణకు విద్యుత్ వినియోగం గతంలోకంటే గణనీయంగా పెరగనుంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అమలుతో మేలు జరుగుతుందని భావిస్తున్నారు.

మంచి నిర్ణయం



ప్రస్తుతం వచ్చే బడ్జెట్‌లో సగం నిధులు కరెంట్ బిల్లులకే సరిపోతున్నాయి. దీంతో పాఠశాలల నిర్వహణ భారంగా మారింది. ఉచిత విద్యుత్ అందిస్తే ఈ నిధులను వేరే అవసరాలకు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. బడులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని సీఎం తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గది.
– వెంకట్రామిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్, గోపాల్‌పేట

భారం తప్పుతుంది



అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఎంపికైన అన్ని పాఠశాలల్లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. బోరుబావులు తవ్వించారు. డిజిటల్ విద్య అందించాల్సి ఉంది. వీటికి చాలా విద్యుత్ అవసరం. ఉచిత విద్యుత్ అందించడం వల్ల పాఠశాలలపై ఆర్థికభారం తప్పుతుంది.
– వెంకటేశం, ఎంఈవో, నాగిరెడ్డిపేట

'సొసైటీ' తప్పిదం.. రైతులకు శాపం

- పంట రుణమాఫీకి 73 మంది దూరం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ఏఈవోకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

లింగంపేట(ఎల్లారెడ్డి): రుణం తీసుకున్న వెంటనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో సొసైటీ సిబ్బంది ప్రదర్శించిన నిర్లక్ష్యం.. 73 మంది రైతులకు శాపంగా మారింది. వారంతా రుణమాఫీకి దూరమయ్యారు. వివరాలిలా ఉన్నాయి. లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం పరిధిలోని 22 గ్రామాలకు చెందిన 1,559 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. మొదటి విడతలో 513 మంది, రెండో విడతలో 100 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. రెండు విడతల్లో పేర్లు లేని రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సంప్రదించి, తమకు ఎందుకు రుణ మాఫీ కాలేదని ఆరా తీస్తున్నారు. అయితే 2023 డిసెంబర్ 9వ తేదీకి ముందే పంట రుణం తీసుకున్నా.. కటాఫ్ తేదీ తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు రికార్డుల్లో ఉండడంతో అవాక్కవుతున్నారు.

లింగంపేట సొసైటీ పరిధిలో గతేడాది డిసెంబర్ 9వ తేదీకన్నా ముందే రుణాలు తీసుకున్నా.. 73 మందికి సంబంధించిన రూ. 49.68 లక్షల రుణాలు మాఫీ కాలేదు. వీరి వివరాలను గతేడాది డిసెంబర్ 21 నుంచి ఈ ఏడాది మార్చి 30 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం గమనార్హం. ఇలా ఉమ్మడి జిల్లాల్లో సుమారు 1,700 మంది రైతులు రుణమాఫీకి దూరమైనట్లు తెలుస్తోంది. రుణమాఫీ కాని రైతులు సొసైటీకి వచ్చి సిబ్బందిని ప్రశ్నిస్తున్నారు. సొసైటీ సీఈవో, చైర్మన్‌లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ చేయడంతో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే రుణమాఫీకి అర్హత కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయం చేయాలని కోరుతూ పలువురు రైతులు సోమవారం మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

రుణమాఫీ కాలేదు



నాకు 36 గుంట భూమి ఉంది. నవంబర్ 6న లింగంపేట సొసైటీలో రూ. 25 వేలు రుణం తీసుకున్నా. రుణమాఫీ కాకపోవడంతో సొసైటీకి వెళ్లి అడిగితే ఈ ఏడాది మార్చి 18 న ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిసింది. సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యంతో నాకు నష్టం జరిగింది. సర్కారు న్యాయం చేయాలి.
– కుర్మ లక్ష్మి, రైతు, బోనాల్

కటాఫ్ తేదీలోపే తీసుకున్నా..



నాకు ఎకరం ముప్పై గుంటల భూమి ఉంది. గతేడాది నవంబర్ 10 న లింగంపేట సొసైటీలో రూ. 57 వేల పంట రుణం తీసుకున్నా. కానీ సొసైటీ సిబ్బంది డిసెంబర్ 26న ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేశారు. దీంతో నాకు రుణం మాఫీ కాలేదు. అధికారులు స్పందించి రుణమాఫీ అయ్యేలా చూడాలి.
– అన్నం సాయిలు, రైతు, మెంగారం

ఉన్నతాధికారులకు సమాచారమిచ్చాం

సొసైటీ పరిధిలో 73 మందికి పంట రుణం మాఫీ కాలేదు. వీరు తీసుకున్న రుణాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఆలస్యం జరిగింది. పని ఒత్తిడి వల్ల సకాలంలో ఆన్‌లైన్ చేయలేకపోయాం. రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించకముందే జిల్లా అధికారులకు పంపించాం. జిల్లాలోని మరికొన్ని సొసైటీల్లోనూ కొందరికి రుణమాఫీ కాలేదు. వారితో పాటు లింగంపేట రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపించారు.
– సందీప్, సీఈవో, లింగంపేట

ఇసుక అక్రమ తరలింపుపై వివరణ ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో గడువు ముగిసినా ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడంపై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. బిచ్కుంద మండలం ఖద్గాం- షెట్లూరు శివారులో రోజుకు సుమారు రూ. 30 లక్షల విలువైన ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయంటూ ఎ.ప్రకాశ్ అనే న్యాయవాది హైకోర్టు సీజేకు లేఖ రాశారు. ఈ లేఖను సుమోటో పిల్‌గా స్వీకరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనల అనంతరం గనులు, భూగర్భ, రెవెన్యూ, రవాణా, హోం శాఖల ముఖ్య కార్యదర్శులు, జిల్లా కలెక్టర్, టీఎస్ ఎండీసీ, తహసీల్దార్‌కు నోటీసులు జారీ చేసింది.

'ఉద్యోగులు సమయపాలన పాటించాలి'



జుక్కల్ కేజీబీవీలో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్: ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సమయ పాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఆయన జుక్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చేపట్టిన పనుల గురించి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. అల్పాహారం, భోజనానికి సంబంధించిన మెనూ గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుతో కలిసి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రులను పరిశీలించారు. వారి వెంట జీసీడీవో ఉమారాణి, ఎంపీడీవో శ్రీనివాస్, కేజీబీవీ ప్రిన్సిపాల్ అశ్విని తదితరులు ఉన్నారు

డీసీఎంఎస్ చైర్మన్‌గా తారాచంద్

- ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటన
- ఇద్దరు నామినేషన్ వేయడంతో నాటకీయ పరిణామాలు
- రాజకీయ పెద్దల జోక్యంతో నామినేషన్ ఉపసంహరించుకున్న సాయన్న



తారాచంద్‌నాయక్‌కు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి రామ్మోహన్

సుభాష్‌నగర్: ఇందూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) చైర్మన్‌గా డిచ్‌పల్లి మండలం రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నగరంలోని ఐడీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ రిజిస్ట్రార్ పి రామ్మోహన్ వ్యవహరించారు. షెడ్యూల్ ప్రకారం మొదట నామినేషన్లు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా గాంధారి సొసైటీ చైర్మన్ సాయన్న, రాంపూర్ సొసైటీ చైర్మన్ తారాచంద్ నాయక్ నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి నుంచి ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తారాచంద్ నాయక్ మధ్య తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ.. సామాజిక సమీకరణలో భాగంగా చివరి క్షణంలో సాయన్న తెరపైకి వచ్చారు. ఒక దశలో కామారెడ్డి వర్సెస్ నిజామాబాద్ జిల్లాగా అధికార పార్టీ డైరెక్టర్లు విడిపోయారు. బీఆర్‌ఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి సాయన్నకు మద్దతుగా నిలిచారు. నిజామాబాద్ జిల్లా కమలాపూర్‌కు చెందిన న్యాస రాజేశ్వర్ సాయన్నను ప్రతిపాదించడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

రాజకీయ పెద్దల జోక్యంతో..

డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక విషయంలో బోధన్, రూరల్ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ఎన్నికల్లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు చర్చించారు. తారాచంద్, ఇంద్రసేనారెడ్డి పేర్లు తెరపైకి రాగా, డీసీసీబీ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్ పదవులు ఒకే సామాజికవర్గానికి ఇస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో ఎస్టీకి అవకాశం కల్పించాలని భావించారు. కానీ ఆఖరు క్షణంలో అధికార పార్టీ డైరెక్టర్లు ఇద్దరు నామినేషన్లు దాఖలు చేయడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. నామినేషన్ల స్క్రూటినీ తర్వాత సుదర్శన్‌రెడ్డి ఇంటికి వెళ్లి మంతనాలు సాగించారు. సుదర్శన్‌రెడ్డి షబ్బీర్ అలీకి ఫోన్ చేసి సాయన్న నామినేషన్ ఉపసంహరించుకోవాలని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు సాయన్న నామినేషన్ ఉపసంహరించుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది.

సాయన్న తప్పుకోవడంతో ఏకగ్రీవం

పోటీ నుంచి సాయన్న తప్పుకోవడంతో చైర్మన్‌గా తారాచంద్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రామ్మోహన్ ప్రకటించారు. అనంతరం ఆయనకు ఎన్నికైనట్లు ధ్రువపత్రం అందజేశారు. దీంతో వైస్ చైర్మన్‌గా ఏదుల్ల ఇంద్రసేనారెడ్డి కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఐడీసీఎంఎస్ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది తారాచంద్ నాయక్‌ను సన్మానించారు. అనంతరం కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గిరిజన, ఆదివాసీ చైర్మన్ కెతావత్ యాదగిరి, సీనియర్ నాయకులు చంద్రునాయక్, శంకర్, అమ్రాబాద్ రవి, రాజునాయక్, తుకారాం నాయక్, బాల్‌రాజ్, చందర్ నాయక్, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మరింత బలోపేతం చేస్తా

సుభాష్‌నగర్: డీసీఎంఎస్‌ను మరింత బలోపేతం చేస్తానని నూతన చైర్మన్ తారాచంద్ నాయక్ పేర్కొన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన తర్వాత ఆయన మాట్లాడారు. పాలకవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు మండవ వెంకటేశ్వర్‌రావు, తాహెర్‌బిన్ హందాన్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, కైలాష్ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఉమ్మడి జిల్లా పదవికి గిరిజనుడినైన తనను ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ అంటేనే బడుగు, బలహీనవర్గాల పార్టీ అని మరోసారి రుజువైందన్నారు. ఎన్నికైన అనంతరం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వైస్‌చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్‌గౌడ్, రాజు గౌడ్, కపిల్‌రెడ్డి, న్యాస రాజేశ్వర్, బిజినెస్ మేనేజర్ నగేష్ పాల్గొన్నారు.

రెండు పదవులు ఒకే జిల్లాకు..

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాతోపాటు జిల్లాల విభజన తర్వాత కూడా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ పదవులు రెండూ సుమారు 20 ఏళ్ల తర్వాత నిజామాబాద్ ప్రాంతానికి దక్కాయి. టీడీపీ హయాంలో డీసీసీబీ చైర్మన్‌గా వీజీ గౌడ్, డీసీఎంఎస్ చైర్మన్‌గా అరికెల నర్సారెడ్డి కొనసాగారు. ఆ తర్వాత కొనసాగిన ఎడ్ల రాజిరెడ్డి (కామారెడ్డి) డీసీసీబీ చైర్మన్‌గా, మునిపల్లి సాయిరెడ్డి (నిజామాబాద్) డీసీఎంఎస్ చైర్మన్, గంగాధర్‌రావు పట్వారీ (నిజామాబాద్), ముజీబుద్దీన్ (కామారెడ్డి), ఈ పాలకవర్గంలో పోచారం భాస్కర్‌రెడ్డి (కామారెడ్డి) డీసీసీబీ చైర్మన్‌గా, సాంబారు మోహన్ (నిజామాబాద్) డీసీఎంఎస్ చైర్మన్‌గా కొనసాగారు. పాలకవర్గం పదవీకాలం ఆరు నెలలే ఉన్నప్పటికీ.. ఒకే జిల్లా నుంచి డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లుగా జిల్లా నాయకులు ఎన్నిక కావడం విశేషంగా చెప్పొచ్చు.

కామారెడ్డిని స్మార్ట్ సిటీగా మారుస్తా

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న షబ్బీర్ అలీ, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ వనిత

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. 'స్వచ్ఛదనం –పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా సోమవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు మంచి గాలి లభించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. జిల్లాకేంద్రానికి తాగునీరు అందించేందుకోసం జలాల్‌పూర్ నుంచి మల్లన్నగుట్ట వరకు తాగునీటి పైప్‌లైన్ నిమిత్తం రూ. 240 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటీకి సంబంధించి అమృత్ స్కీం కింద చేపట్టే రూ.93 కోట్ల పనులకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. నియోజకవర్గానికి సాగు నీరు అందించేందుకు ఉద్దేశించిన ప్రాణహిత –చేవెళ్ల ప్రాజెక్టు ప్యాకేజీ పనులు పూర్తి చేయడానికి రూ. 1,200 కోట్లు అవసరం ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి రూ. 200 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ ప్యాకేజీ పూర్తయితే 2,54,000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పట్టణంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం త్వరలో 133/11 సబ్‌స్టేషన్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధిలో పోటీ పడాలి కానీ కొందరు అభివృద్ధిని అడ్డుకోవడంలో పోటీ పడుతున్నారని విమర్శించారు. కామారెడ్డిలో జరుగుతున్న అభివృద్ధిపై కొందరు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయడం లేదన్నారు. ఇక్కడ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేయక పోయినా పుట్టిన గడ్డపై ఉన్న ప్రేమతో కామారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైస్ చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కస్తూర్బాలో నీటికి కటకట



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లి గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలో నీటి ఎద్దడితో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నీళ్ల లేక మూడు నాలుగు రోజులకు ఒక్కసారి స్నానం చేస్తున్నారని, దుస్తులను వారానికొకసారి ఉతుక్కుంటున్నారు. పాఠశాలలో 400 మంది విద్యార్థినులున్నారు. పాఠశాలలో ఉన్న బోరు నుంచి వీరికి సరిపడా నీరు రావడంలేదు. దీంతో ప్రైవేట్ బోర్‌పైన ఆధారపడ్డప్పటికీ బోరు నుంచి నీళ్లు ఎక్కువగా రావట్లేదు..మరోవైపు పాఠశాల గదుల్లోకి పాములు వస్తుండడంతో వారు మరింత భయభ్రాంతులకు లోనవుతున్నారు. రాత్రయిందంటే చాలు.. సరిగ్గా నిద్రకూడా పోలేని పరిస్థితి వచ్చిందని విద్యార్థినులు వాపోతున్నారు. నీటి సమస్యను, పాముల బెడద నుంచి తమను తప్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

జుక్కల్‌ను అభివృద్ధి చేస్తాం



మద్నూర్(జుక్కల్) : వెనుక బడిన ప్రాంతంగా పేరున్న జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. మండలంలోని సోమూర్, హిప్పర్గా గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రాంతానికి కావాల్సిన నిధులు తీసుకువచ్చి అన్ని మండలాలను అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పరుగులు పెడుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, నాయకులు హన్మంత్‌రావ్‌దేశాయ్, ప్రజ్ఞకుమార్ తదితరులున్నారు.

మద్నూర్ మాజీ సింగిల్ విండో చైర్మన్ గంగాధర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మండలంలోని పెద్ద తడ్గూర్‌లో ఆయన నివాసానికివ వెళ్లి పరామర్శించారు.

9న రేషన్ డీలర్ల ఎంపికకు రాత పరీక్ష

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డి ,లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాలకు సంబంధించి ఎనిమిది రేషన్ దుకాణాలకు గాను దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 9న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాత పరీక్ష ఉంటుందని ఆర్డీవో మన్నే ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధిలో 8 రేషన్ దుకాణాలకు గాను 72 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా వారిలో ఐదు దరఖాస్తులను తిరస్కరించామన్నారు. 67 మందికి పరీక్ష ఉంటుందన్నారు. దాంట్లో ప్రతిభ చూపితే ఇంటర్వ్యూ చేస్తామన్నారు.

ప్రహరీని ఢీకొట్టిన కారు



ఘటనాస్థలంలో బోల్తాపడిన కారు

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐటీఐ కాలేజీ సమీపంలో ఆదివారం రాత్రి టైరు పేలడంతో కారు ఓ ఇంటి ప్రహరీని ఢీకొట్టినట్లు ఎస్సై రామ్ తెలిపారు. కారులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారని, బాధితుల ఫిర్యాద మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- 50కి పైగా ఫిర్యాదులు
- స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అధికారులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

కామారెడ్డి క్రైం : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి దరఖాస్తుదారులు క్యూ కట్టారు. కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో బిజీగా ఉండి ప్రజావాణికి రాలేదు. కలెక్టరేట్ పాలనాధికారి మస్సూర్ అహ్మద్, తహసీల్దార్ ప్రేమ్ కుమార్ వినతులు స్వీకరించారు. అయినప్పటికీ జనం ఎక్కువగానే వచ్చారు. 50 కి పైగా ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులే నమోదయ్యాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యు నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేష్ మాట్లాడుతూ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన కేసీఆర్ ప్రభుత్వ పోకడలనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందన్నారు. విద్యా, వైద్య రంగాలను విస్మరించే బడ్జెట్ ను ప్రవేశపెట్టి చేతులు దులుపుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నూతన గురుకులాలకు సొంత భవనాలు స్థలాల కేటాయింపు ఇప్పటి వరకు లేదన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందన్నారు. తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ప్రజావాణిలో అదజేశారు.

షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి..

చెరుకు రైతులను మోసం చేసిన గాయత్రి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎంఎల్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఐఎంఎల్ నాయకులు మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ దాదాపు 2500 మంది రైతులకు చెందిన రూ. 30 కోట్ల వరకు రుణమాఫీ డబ్బులను ఫ్యాక్టరీ యజమాన్యం స్వాహా చేసినట్లుగా స్పష్టంగా తెలుస్తుందన్నారు. వారిపై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లాను ఆదర్శంగా నిలపాలి



భిక్కనూరు ర్యాలీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

- స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

భిక్కనూరు : జిల్లాను రాష్ట్రంలోనే స్వచ్ఛదనం-పచ్చదనంలో ఆదర్శంగా నిలపాల్సిన బాధ్యత జిల్లా వాసులందరిపైన ఉందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటు బస్వాపూర్ గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛదనం- పచ్చదనం గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ తమ పుట్టిన రోజున పెళ్లిరోజున తప్పని సరిగా రెండేసి మొక్కలను నాటడంతో పాటు అవి పెరిగి పెద్దయ్యేలా చూడాలన్నారు. వేప చెట్లను ఎక్కువ నా టడం వల్ల గాలిలో ఆక్సిజన్ ఎక్కువ శాతం పెరుగు తుందన్నారు. కలుషిత నీరు వల్ల దోమల వల్ల రో గాలు వస్తాయని వీటి పట్ల జాగ్రతగా ఉండాలి అ న్నారు. కోతుల బెడద నివారణ ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. గ్రామం బయట పండ్ల మొక్కలను విరివిగా నాటి అవి పెద్దగా అయ్యేలా చూస్తే కోతులు గ్రామాల్లోకి రావన్నారు. అడవులు అంతరించిపోతే కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రంలో కుక్కలకు కు.ని. శస్త్ర చికిత్స ఉందన్నారు. కోతుల బెడద కుక్కల బెడద నివారణ కేసు హైకోర్టులో ఉందన్నారు. ర్యాలీల్లో ఆయన పాల్గొని పలు కూడళ్ల వద్ద ప్రజలకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి రజిత, ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి, విండో చైర్మన్ గంగ్ల భూమయ్య ఈవో మహేష్‌గౌడ్ మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, బండి రాములు, నేతలు లింబాద్రి మైపాల్‌రెడ్డి, సుదర్శన్ తదితరులున్నారు.

అధ్యాపకులు రారు.. పాఠాలు చెప్పరు..



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కళాశాల విద్యార్థులు

- ఐదురోజులుగా తెరుచుకోని నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాల
- ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిరీక్షించి వెళ్లిపోతున్న విద్యార్థులు
- పాఠాలు చెప్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఐదురోజులుగా నాగిరెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల తాళాలు తీసే వారితో పాటు పాఠాలు చెప్పేవారు కరువయ్యారు. దీంతో కళాశాల విద్యార్థులు ఉదయం నుండి మధ్యాహ్నం వరకు కళాశాల వద్ద అధ్యాపకుల కోసం నిరీక్షించి నిరాశతో ఇళ్లకు వెళ్తున్నారు. సోమవారం సైతం కళాశాలకు అధ్యాపకులెవరూ రాకపోవడంతో మధ్యాహ్నం 12గంటల వరకు నిరీక్షించిన విద్యార్థులు నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయానికి చేరుకొని స్థానిక తహసీల్దార్ లక్ష్మణ్‌కు వారు వినతి పత్రాన్ని అందజేశారు.

కళాశాలకు నిత్యం 30-35మంది విద్యార్థులు వచ్చి గంటల తరబడి నిరీక్షించి వెళ్లిపోతున్నారని వారు పేర్కొన్నారు. లేకపోతే రోడ్డెక్కి ఆందోళన చేస్తామన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ పేర్కొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్



చెక్కును అందజేస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి క్రైం : కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా పేదలకు అండగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. నియోజకవర్గం లోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల ను పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ఎఫ్ దర ఖాస్తుల సీఎంతో మా ట్లాడి కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపు 300 మందికి నిధులు మంజూరు చేయించామన్నారు. రుణమాఫీ విషయంలో సహకార బ్యాంకుల్లో పోడు,ప్రభుత్వ భూములపై తీసుకున్న రుణాలు రద్దు కాలేదని, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో మాట్లాడానన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని పలువురికి సోమవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధితులకు పంపిణీ చేశారు. ఆశయ్య, సత్యం, గంగమణి, మల్లవ్వ, గాదారి నారాయణ, రాజయ్యలకు చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, నాయకులు చిందం రాజయ్య, అన్వేష్ గౌడ్, బాల్‌రాజు, బీరయ్య తదితరులున్నారు.

చేపల వేటపై అధికారుల కొరడా



నిజాంసాగర్(జుక్కల్) : నిబంధనలకు విరుద్ధంగా నిజాంసాగర్ ప్రాజెక్టులో చేపల వేట సాగిస్తున్న మత్స్య కార్మికులపై మత్స్యశాఖ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. సోమవారం నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని హసన్‌పల్లి, ఆరేడ్, ఆరేపల్లి, మాదవ పల్లి గ్రామాల ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకార్మికుల నుంచి వలలు, తెప్పలు, తెడ్లను మత్స్యశాఖ అధికారులు స్వాధీన పర్చుకున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ రెండు నెలల పాటు ప్రాజెక్టుల్లో చేపల వేట నిషేధం ఉన్నప్పటికి కొందరు మత్స్యకార్మికులు చేపల వేట కొనసాగించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

మహారాష్ట్రకు మహాలక్ష్మి సిలిండర్లు



మహారాష్ట్రకు తరలిస్తున్న రాయితీ సిలిండర్లు

బిచ్కుంద(జుక్కల్) : తెల్లరేషన్ కార్డుదారులకు మహాలక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం రూ.500కు అందిస్తున్న గ్యాస్ సిలిండర్లు మహారాష్ట్రకు తరలుతున్నాయి. బిచ్కుందలో కొందరు బ్రోకర్ల అవతారమెత్తి మహాలక్ష్మి సింలిడర్లను పక్కదారి పట్టిస్తున్నారు. మూడు నాలుగు నెలలకోసారి సిలిండర్ తీసుకుంటున్న లబ్ధిదారులను గుర్తించి వారితో మాట్లాడుకుని వారిపేర్లను సిలిండర్లను తీసుకుంటూ మహారాష్ట్రకు తరలిస్తున్నారు. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీలు, జిలేబీ కేంద్రాలకు తరలిస్తున్నారు. వినియోగదారులకు చేరాల్సిన సిలిండర్లు నేరుగా వ్యాపార కేంద్రాలకు చేరుతున్నాయి. బిచ్కుందలో హెచ్‌పీ, ఇండేన్ ఏజెన్సీలు ఉండగా, ఇక్కడి సిలిండర్లను మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు తరలిస్తూ రూ.1400 వరకు విక్రయిస్తున్నారు. బ్లాక్‌లో కొనాలనుకున్నా దెగ్లూర్‌లో సిలిండర్ దొరకకపోవడం, తెలంగాణలో రాయితీ సిలిండర్లు లభిస్తుండడంతో బిచ్కుంద, మద్నూర్ మండలాల నుంచి జోరుగా తరలిస్తున్నారు. రాయితీ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయని అధికారులకు తెలిసినా ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని బిచ్కుంద తహసీల్దార్ సురేశ్ దృష్టికి తీసుకెళ్లగా పౌర సరఫరాల శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రాయితీ సిలిండర్లు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రారంభమైన శ్రావణమాస భజనలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం శ్రావణ మాస నిత్యభజన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భజన బృందం సభ్యులు మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ప్రతిరోజు గంట పాటు భనజ కార్యక్రమం చేపట్టనున్నట్లు బృందం ప్రతినిధులుత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జోగిని రాజయ్య, భజన బృందం ప్రతినిధులు కొప్పుల నర్సారెడ్డి, జంగం గంగాధర్, కాటిపల్లి లక్ష్మీకాంతం తదితరులున్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి

- ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు
- స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్



మొక్కను నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, పక్కన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్: పారిశుధ్యంపై దృష్టి సారించి స్వచ్ఛ తెలంగాణ నిర్మాణానికి కృషి చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సూచించారు. సోమవారం ఆయన జుక్కల్ మండల కేంద్రంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో కలిసి 'స్వచ్ఛదనం, పచ్చదనం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. జుక్కల్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ తీశారు. వన మహోత్సవంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ఆస్పత్రి ఆవరణలో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మురికి కాలువల్లో చెత్తాచెదారం తొలగించాలని, రోడ్లపై మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో నాగరాజు, అటవీ శాఖ రేంజ్ అధికారి సంతోషి, ఎంపీడీవో శ్రీనివాస్, నాయకులు రమేశ్‌దేశాయ్, అస్పత్‌వార్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిలదీత

జుక్కల్‌లో స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని వెళ్తున్న ఎమ్మెల్యేను స్థానికులు పలు సమస్యలపై నిలదీశారు. వజ్రకండి గ్రామ రోడ్డుతో పాటు అంబేడ్కర్ చౌరస్తా నుంచి జెడ్పీ హైస్కూల్ వరకు రోడ్లు అధ్వానంగా మారాయని పేర్కొన్నారు. బురదమయంగా ఉన్న రోడ్ల దుస్థితిని వివరించారు. తనను అడ్డుకోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకొని యువకులను సముదాయించారు. సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వగా యువకులు శాంతించారు.



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న యువకులు

క్రైం కార్నర్

యువతి అదృశ్యం

జక్రాన్‌పల్లి : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలో గల గాంధీనగర్‌కు చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. ఈ నెల 4న ఉదయం 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి బయటికి వెళ్లిపోయి తిరిగి రాలేదన్నారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

నవీపేట: మండలంలోని యంచ వద్ద గోదావరిలో దూకి ఓ మహిళ సోమవారం ఆత్మహత్యాయత్నం చేయగా, గ్రామస్తులు కాపాడారు. మండలంలోని శివతండాకు చెందిన బానావత్ జ్యోతి కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకుంది. నదిలో దూకేందుకు ఆమె ప్రయత్నిస్తుండగా యంచకు చెందిన నరేశ్, ఖలీల్, వినోద్ ఆమెను కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హత్యకేసులో జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: ఓ హత్యకేసులో కామారెడ్డి కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2021 ఆగస్టు 4 న మెదక్ జిల్లా రామాయంపేట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన తుడుం రాకేష్ (23) భిక్కనూర్ మండలం బస్వాపూర్ శివారులో హత్యకు గురయ్యాడు. మృతుడి అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ జరిపారు. హత్య జరిగిన రోజు పనిమీద రామాయంపేటకు వచ్చిన రాకేష్‌ను ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పరిచయం అయిన మహ్మద్ ఇమ్రాన్ అనే స్థానికుడు హత్య చేసినట్లు తేలింది. బైక్ చోరీ ఉద్దేశంతో మద్యం తాగుదామని నమ్మించి బయటకు తీసుకువెళ్లి హత్య చేసినట్లు గుర్తించి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చారు. అప్పటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ కామారెడ్డి కోర్టు రెండవ అదనపు సెషన్స్ జడ్జి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెల్లడించారు. సరైన పద్ధతిలో విచారణ జరిపి నిందితుడికి శిక్ష పడేలా చేసిన డీఎస్పీలు లక్ష్మీ నారాయణ, నాగేశ్వర్ రావు, సీఐలు రాజశేఖర్, సంపత్ కుమార్, ఎస్సైలు రాజు, సాయికుమార్, సిబ్బంది రాజగౌడ్, రాజశేఖర్ గౌడ్, మురళి లను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

వైన్ షాపులో షార్ట్ సర్క్యూట్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని దుర్కిలో ఉన్న బాలాజీ వైన్ షాపులో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సుమారు రూ.9లక్షల ఆస్తినష్టం సంభించిందని వైన్స్ నిర్వాహకుడు సత్య నారాయణ తెలిపారు. సోమవారం ఉదయం వైన్‌షాపు తెరిచే సమయానికి విద్యుత్ వైర్లు కాలిపోయి మద్యం బాటిళ్లు దహనమయ్యాయని తెలిపారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను అదుపు చేశారన్నారు.

టీ కోసం వెళ్తుండగా ఢీకొట్టిన బైక్

- రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



లింగంపేట(ఎల్లారెడ్డి): టీ తీసుకువచ్చేందుకు రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెడ్డిగారి చెన్నమ్మ(70) అనే వృద్ధురాలు మృతి చెందింది. మండల కేంద్రంలోని కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రోడ్డుపై చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలను ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. సదాశివనగర్ మండలం ధర్మరావుపేటకు చెందిన చెనమ్మ కూతురు సుజాత అనారోగ్యంతో బాధపడుతూ లింగంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను చూసేందుకు వచ్చిన చెన్నమ్మ సోమవారం రాత్రి 7గంటలకు టీ తీసుకువచ్చేందుకు రోడ్డు దాటుతుండగా అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో చెన్నమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గ్రామ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శరీరం రెండు ముక్కలైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

రైలులో నుంచి జారిపడి..



కామారెడ్డి క్రైం: రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందిన ఘటన తలమడ్ల- భిక్కనూర్ రైల్వే స్టేషన్‌ల మధ్య సోమవారం చోటు చేసుకుంది. రైలు పట్టా పక్కన మృతదేహం ఉందని సమాచారం అందడతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రైల్వే ఎస్సై తావ్యానాయక్ తెలిపారు.

ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి ఒకరు..

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లిలో మేస్త్రీ పని చేస్తున్న మనబోయిన నారాయణ (47) ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. సోమవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ప్రకాశం జిల్లా నుంచి పదేళ్లక్రితం వచ్చిన నారాయణ కొత్తపల్లిలో నివాసం ఏర్పర్చుకుని చుట్టు పక్కల గ్రామాల్లో మేస్త్రీ పని చేస్తున్నాడు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణ సోమవారం సాయంత్రం టీతాగేందుకు బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెతకగా డ్రెయినేజీలో పడినట్లు గుర్తించారు. వెంటనే బయటకు తీయగా నారాయణ అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ..

నందిపేట్ (ఆర్మూర్): బీపీ, షుగర్ ఎక్కువై నరాలు దెబ్బతినడంతో డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన తోకల కిషన్(53) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. తోకల కిషన్ గత వారం రోజుల క్రితం మండల కేంద్రానికి వచ్చి గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం కిషన్ తన గదిలో అచేతనంగా పడిపోయి ఉండడాన్ని గమనించిన పక్కింటి వ్యక్తి ఫయాజ్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే కిషన్‌ను స్థానిక వైద్యులకు చూపించగా వారి సిఫారసు మేరకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు తోకల సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అకౌంట్ నుంచి రూ. 96 వేలు మాయం

ధర్పల్లి: కస్టమర్ కేర్ నంబర్‌కు ఫోన్ చేసిన వ్యక్తి బ్యాంక్ అకౌంట్‌లో నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన గంగాధర్ నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో సెర్చ్ చేసి ఫోన్ చేశాడు. వెంటనే అతడి ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.96 వేలు కాజేశారు. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.